# హైద్రాబాదు తెలుగు కథకులు

## శ్రీ మానేపల్లి తాతాచార్య

మన హైదాబాదులో నేడు అన్నిటితో పాటు సాహిత్యరంగంకూడ దినదినాభివృద్ధి చెందుతున్నది. ఆంధ్రదేశాని కంతటికి నవ్యకవితాసుధను రుచి చూపించిన శ్రీరాయ ప్రోలు సుబ్బారావుగారు, పారసీకవిజ్ఞానాన్ని ఆంధ్ర ప్రజలకు పంచిపెడుతున్న జనాబ్ ఖాసింఖానుగారు, సాహిత్యవిమర్శకు లయిన శ్రీ కురుగంటి సీతారామయ్యగారు మనమధ్య నుండి మనకు మార్గదర్శకులుకావటం చాలా ఆశాజనకమైన విషయం. ఇంకా యెంద రెందరో సమర్థులు తమకృషివల్ల సాహిత్యానికి పుష్టిని కలిగిస్తున్నారు.

ఇటువంటి అనుకూలవాతావరణంలో సాహిత్యరంగంలో నేడు ముఖ్యమైన శాఖగా గుర్తింపబడ్డ కథానికసాహిత్యంకూడా చాలా ఆశాజనకంగా అభివృద్ధి చెందుతూ వున్నది. ఆధునికవిజ్ఞానసంపన్నులైన అనేకమంది యువకులు దానిమీద తమ మేధాశక్తులను కేంద్రీకరిస్తున్నారు.

హైద్రాబాదు విషయములో దేనిని గురించి చెప్పవలసివచ్చినా ఆంధ్రపితామహ, శ్రీ మాడపాటి హనుమంతరావుగారిని గురించి ముందు చెప్పవలసినట్లుగానే కథానిక సాహిత్యములోగూడా వారినే ముందుగా పేర్కొన వలసి యుంటుంది. వీరు కథానికయొక్క ప్రాముఖ్యతను గుర్తించి. యీ ప్రాంతంలో ప్రథమంగా కథలు వ్రాయ పూనుకున్నారు. ప్రజల జీవితాలను కథానికలద్వారా ప్రతిబింబింపజేసి, వారిని విజ్ఞానవంతులుగా చేయడం సులభమని వీరు గుర్తించారు. అందువల్లనే వీరిభాష గ్రాంథికంగా ఉన్నప్పటికి, కథలు మాత్రం ప్రజాజీవితాన్ని దాటి పోలేకపోయినాయి. ప్రజల కష్టసుఖాలను అద్దములో చూపించినట్టుగా ఉంటవి వీరిరచనలు.

వీరితర్వాత పేర్కొనదగినవారు శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు. ప్రతాపరెడ్డిగారు తమ కథారచనలవల్ల హైద్రాబాదుకు ఆంధ్ర కథాసాహిత్యంలో ప్రత్యేకస్థానాన్ని యేర్పరచారు. మన హైద్రాబాదు ఆంధ్రులకేగాక యితర ప్రాంతాల ఆంధ్రులకు గూడా వీరు ఉత్తమకథకులుగా చిరపరిచితులు. వీరి రచనలలో హైదాబాదు సంస్థానంలోని ప్రజల జీవితం ప్రతిబింబిస్తుంటుంది. ప్రజల జీవనాన్ని చిత్రించటానికి వీరు స్థానికంగా ఉపయోగింపబడుతున్న పదాలను ఉపయోగించటం తమ కథలకు వన్నె తెచ్చిపెడుతున్నది. ఈప్రాంతాలలో స్థానికముగా ఉపయోగింపబడుతున్న అనేక పదాలు ఇతర ప్రాంతాల ఆంధ్రులకు తెలియజేసి ఆంధ్రభాషను విశాలవంతముగా చేయుటానికి వీరి రచనలు తోడ్పడుతున్నవి.

భాషకు ఈ విధముగా వీరు చేస్తున్న సేవ ప్రశంసనీయము.

అటుతర్వాత శ్రీ కాళోజి నారాయణ రావుగారిని గురించి చెప్పవలసి యుంటుంది. వీరి రచనావిధానములో ప్రత్యేకత ఉన్నది. వ్యంగ్యరచనలుచేయుటంలో వీరిది అందెవేసిన చెయ్యి. పైగా ఆ వ్యంగ్యం చాలా ఆరోగ్య వంతంగాకూడా ఉంటుంది. పాఠకులను నవ్విస్తూనే పాఠాలు నేర్పుతుంటారు. ''మనమే నయం'' మొదలైన వీరిరచనలలో మానవ జాతిలోని అవినీతులపైన చక్కని వ్యాంగ్యము గోచరిస్తుంటుంది. వీరి రచనలలో పూర్తిగా స్థానికంగా వాడుకలోనున్న భాషే ఉంటుంది. అందువల్ల యితరప్రాంతాల ఆంధ్రులు ఆరచనలను ఇక్కడి ఆంధ్రులంత ఆనందముతోటి చదువలేకపోవటం తటస్థిస్తున్నది.

ముందు చెప్పిన వారితోపాటు అనేక మంది సిద్ధహస్తులైన యువకులు కథావీధులలో తమకు ప్రత్యేకస్థానాలను సంపాదించుకున్నారు. శ్రీ భాస్కరభట్ల కృష్ణారావుగారు అందులో మొదటివారు. వీరి రచనలతో ఇక్కడి ఆంధ్రులకేగాక యితర ప్రాంతాల ఆంధ్రులకుగూడా యెక్కువ పరిచయము. ఉత్సాహవంతులైన యువకులు. ప్రతి విషయాన్ని సూక్ష్మమైన విమర్శనా దృష్టితో చూస్తారు. తీవ్రమైన సంస్కారవాంఛ గలవారు. నేడు పత్రికలలో వాడుకలలో నున్న భాషనే బహుళంగా ప్రచారంలోకి తీసుకురావాలని నమ్మకం గలవారు. వారిలోనున్న ఈ ఆదర్శాలే తమ రచనలతో కనబరుస్తారు. సంసారజీవనాన్ని ఆహ్లాదకరంగా చిత్రించటములో వీరికి ప్రత్యేకత ఉన్నది. వీరి కథలు చదువుతుంటే మన జీవితాలు మన అలవాట్లు చూచి మనకే నవ్వువస్తుంది. కాని ముగింపుకి వచ్చేటప్పటికి "అయ్యో మనము ఇంతటి హాస్యాస్పదమైన స్థితిలో ఉన్నామా ?'' అనిపిస్తుంది. వీరు పట్టుదలతో ప్రయత్నిస్తే చక్కని వ్యాంగ్యరచయితలు కాగలరని నమ్మకం కల్గుతున్నది. తప్పక ఆవిధంగా చేసి మన ఆంధ్ర పాఠకులను రంజింపజేస్తారని ఆశిస్తున్నాము.

తమ కథారచన వల్ల తెలుగు సాహిత్యాని కంతటికీ వన్నె తెచ్చిపెట్టగలదను ఆశ కలిగిస్తున్నారు శ్రీపొట్లపల్లి రామారావుగారు. వీరు ప్రకటించిన కథలు ఇంతవరకు కొద్దిగానే ఉన్నప్పటికి కథానికసాహిత్యంలో వీరివి ఉత్తములుగా గుర్తించటానికి అవకాశం కలిగిస్తున్నాయి. సంస్కారంగల యువకులు. సున్నితహృదయులు. ప్రపంచములోని అవకతవకలు చూచి చాలా బాధపడుతుంటారు. ఈ ఆవేదనే వారిరచనలలో కనిపిస్తుంటుంది. వారు వ్రాసిన యే వాక్యం తీసుకున్నా మేధశ్శక్తి యొక్క బలమైనకృషి కనిపిస్తుంది. ఎంతో భావం యిమిడి వుంటుంది. కథానికలలో సృష్టించే పాత్రలలో పూర్తిగా లీనమైపోతుంటారు. అందువల్ల వారు సృష్టించే పాత్రలన్నీ సజీవముగా ఉంటాయి. సమాజములోని అవకతవకలను పాఠకులముందు పెట్టి "ఏమిటిది ? మనకు సిగ్గుచేటుపని గాదూ ?'' అనిపిస్తారు. ఇంకా ప్రకటింపబడని రచనలు వీరివి అనేకం ఉన్నాయి. అవన్నీ వెలుగులోకి వచ్చినట్లయితే వీరిప్రతిభను ఇంకా యినుమడింప జేస్తాయి. మన కథాసాహిత్యానికి విలువైన సంపత్తును చేకూరుస్తాయి. ప్రజలను యెంతో విజ్ఞానవంతులుగా చేస్తాయి ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని శ్రీ రామారావుగారు సాహిత్య

రంగంలో తమకుగల బాధ్యతను గుర్తించి తమకర్తవ్యాన్ని నెరవేర్చాలి.

శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామిగారికథలు ఈమధ్య మనం చూస్తూవున్నాము. జీవితము లోని కష్టసుఖాలవల్ల విలువైన అనుభవాలు పొందిన యువకులు. వీరు ప్రజలమధ్య మెలుగుతూ వారిజీవితాలతో యెల్లప్పుడు సంబంధము పెట్టుకోటానికి కృషిచేస్తుంటారు. ప్రజల జీవితాలతో తమకు కలిగిన అనుభవాలే వీరికి అంతులేని కథావస్తువులు. కార్మిక కర్షకుల జీవితాలను చిత్రిస్తుంటవి వీరికథలు. పొట్టకోసము మానవులు యెటువంటిపను లయినా చేయటానికి సాహసిస్తారని నిరూపిస్తుంటారు. కూటికి మాడుతున్నప్పుడు ప్రజలలో నైతిక బలంకూడా పతనం చెందటానికి అవకాశము ఉన్నదన్న సత్యాన్ని వెల్లడిస్తుంటారు. టెక్నికల్‌గా వీరికథలు కొంత వెనుకబడి ఉన్నప్పటికి వారు గ్రహించే కథావస్తువులు దానిని మరిపింపజేస్తాయి. ఈ లోపాన్ని వారు సరిదిద్దుకుంటే మంచికథకు లవుతారు.

కథానికలలో ఇతరులకంటే ప్రత్యేకమైన పోకడ గలవారు శ్రీ బూర్గుల రంగనాథరావుగారు. కొన్ని ఆదర్శాలనే పాత్రలుగా సృష్టించి కథలు నడుపుతుంటారు. అట్టి ఆదర్శాలు ఉత్తమమైనటువంటి వవటంచేత కథలు గంభీరంగాఉంటాయి. సంతుణమైన సంస్కృతి కనిపిస్తుంటుంది. దానికితోడు భాషలోగూడా మంచిపటుత్వం ఉంటుంది. కాని వీరి కథలను గురించి చెప్పేటప్పుడు ఒకవిషయము మరువ గూడదు. కేవలము ఆదర్శాలనే పాత్రలుగా సృష్టించటంచేత ఆపాత్రలు సామాన్య మానవుల స్థాయిలో ఉండవు. ప్రజలకు అతీతమైనవిగా కనబడుతుంటాయి. అందువల్ల విద్యాధికు లైనవారు తప్ప ఇతరులు వీరి కథలను చదివి ఆనందించటం తక్కువ. అంతమాత్రముతో వారికథలకు ప్రాముఖ్యత లేదనటానికి వీలులేదు. వాటిప్రత్యేకత వాటిదే.

నెల్లూరి కేశవస్వామిగారుకూడా మన కథలకులలో ప్రథమశ్రేణికి వస్తారు. విద్యాధికులు పాశ్చాత్య, హిందీ కథలను చదివి జీర్ణించుకున్నవారు. ఆపోకడలన్నీ వీరి కథలలో గోచరిస్తుంటాయి. టెక్నికల్‌గా కథలలో మంచి అభివృద్ధి ఉన్నది. ప్రపంచంలో జరిగే న్యాయఅన్యాయాలను వాటి నిజస్వరూపంలో చూపించి నేటిసమాజంయొక్క దివాలాకోరుతనాన్ని బయట పెడుతుంటాయి వీరికథలు.

జమ్మలమడక సోదరులు మన కథాసాహిత్యంలో గుర్తింపదగినవారు. సూర్యచంద్రులు యిద్దరూ సాహిత్యంఅంటే అత్యంతాభిలాష గలవారు. తమకాలం చాలావరకు గేయ రచనలోనే వినియోగిస్తున్నప్పటికి కథానిక రచనలోగూడా తమ శక్తికొలది కృషి చేస్తున్నారు. సమాజం తన బాధ్యత వదులుకొని దూరంచేసిన దీనుల చరిత్రలను వివరిస్తుంటాయి వీరి కథలు. ఆదీనుల చరిత్రలను వినిపించి నిస్పృహతో ముగింపు చేయక, ఆ దీనులుగూడా మానవులలాగ బ్రతకటానికి అవకాశం ఉన్నదనే ఆశా జ్యోతిని కలిగించేటట్లు ఉంటే ఇంకా బాగుంటాయని చెప్పవచ్చు.

తెలుగు కథా సాహిత్యం మీద అభిమానం ఉన్న ప్రతివారికి నందగిరి దంపతులను చూస్తే ముచ్చట కలుగుతుంది. ఇద్దరూ

చక్కని కథకులు, కాని నండగిరి వెంకటా్రివు గారు ఈమధ్య కథలను ప్రికటించటం పూర్తిగా మానుకోటం చాలా విచారకరమైన విషయం. తెలుగుకథా సాహిత్యానికి కొత్తతోడుగులు చేకూర్చగలరని ఆశ కలిగించిన వారు ఈవిధంగా నిస్తబ్ధత వహించటం క్షంతవ్యం కాదనిపిస్తుంది.

హైదా్రిబాదు సాహిత్యకారులు గర్వింప దగిన విషయం యేమిటంటే పురుషులతో బాటు స్త్రీలుగూడా ఉత్తమ కథారచయిత్రిలుగా ముందుకి వస్తున్నారు. శ్రీమతి ఇందిరాదేవిగారు ఆంధ్ర పాంతాలన్నింటిలోను కథకురాలుగా పేరుగడించారు. స్త్రీలసమస్యలను తీసుకుని చక్కగా చిత్రించటంలో సామర్థ్యత ఉన్నది. స్త్రీల భావపరివర్తనలను హృదయవేదనలను మన కండ్లకు కట్టినట్లు చిత్రించగలరు. స్త్రీలజౌన్నత్యానికి తోడ్పడటానికి వీరు తమరచనను వినియోగిసున్నారు. స్త్రీలలో చైతన్యం కలిగించటానికి వీరుచేసే యీ ప్రయత్నం ప్రశంసనీయం.

శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారి గారు వ్యాసరచనయందేకాక కథానిక రచనయందుగూడా సామర్థ్యం కలవారని చెప్పాలి. కాని వీరు ప్రకటించిన కథలు చాలాస్వల్పం. కథలు చక్కని శైలిలో నడుస్తాయి భాష కండగలిగి ఉంటుంది. యువతీ యువకుల భావ చిత్రణ స్ఫుటంగా ఉంటుంది.

వీరేగాక స్త్రీలలో శ్రీమతి భారతమ్మ మొదలైనవారు ఈ మధ్య చక్కని కథలు వ్రాస్తున్నారు. ముందుముందు స్త్రీలలో గూడా ఉత్తమ కథకురాండ్రు అనేక మంది రాగలరని నమ్మకం కలుగుతున్నది.

హైదా్రబాదు తెలుగు కథకుల గురించి ప్రస్తావించేటప్పుడు ముఖ్యంగా ఒక విషయము గమనింపవలసియుంటుంది. అందరు కథకులు సాహిత్యాన్ని ఆనందానికి ఉపయోగపడే ఒక సాధనంగా మాత్రమేగాక, తమ చేతులలో అది ఒకబలపత్తరమైన ఆయుధంగా గుర్తించినట్లు తెలుస్తున్నది. అందువల్లనే చక్కని కథలు వ్రాయగలుగుతున్నారు. ఈ అభ్యుదయకరమైన దృష్టితో నడిస్తే, సాహిత్యాన్ని విశాలవంతం చేయటమేగాక సమాజానికి బ్రహ్మాండమైన సేవచేయగలుగుతారని ఆశించవచ్చును.

(హైద్రాబాదు రేడియోవారి అనుమతిని)

## ద్వితీయ ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ
## రచయితల మహాసభ.

డిశంబరు 29, 30, 31 తేదీలలో బెజవాడలో జరుగుతుంది.

—:♦:—

నవ్యసాహిత్య పరిషత్కార్యదర్శులు, ప్రతిభ సంపాదకులు అగు శ్రీ తెలికిచర్ల వెంకటరత్నంగారు అధ్యక్షతవహిస్తారు. రచయితలు, సాహిత్యాభిమానులు, కవులు విచ్చేసి సభను జయప్రదం చేయాలని కోరిక.

—ఆహ్వానసంఘం